## ఐఐఆర్ఎస్ శిక్షణ అంతరిక్ష పరిశోధనకు దోహదం



అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి

**మేడ్చల్, మార్చి 29:** ఐఐఆర్ఎస్ శిక్షణ భవిష్యత్‌లో అధ్యాపకుల అంతరిక్ష పరిశోధన, భౌగోళిక డేటా విశ్లేషణ, సాంకేతిక అభివృద్ధికి దోహదం చేస్తుందని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. ఇస్రో-ఐఐఆర్ఎస్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో బస్తీ దవాఖాన కోసం వినతి



హెల్త్ కమిషనర్ కన్నన్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి.

**రామంతపూర్ ,మార్చి 29:** రాజేంద్రనగర్‌లో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని కోరుతూ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కమిషనర్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ శ్రీ కన్నన్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజేంద్రనగర్ కమిటీహాల్ బస్తీ దవాఖాన పనులు దాదాపు పూర్తి అయిందని, వెంటనే బస్తీ దవఖాన ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు.

## ఉద్యమకారుల డిమాండ్లను నెరవేరాలి

**ఉప్పల్ మార్చి 29:** తెలంగాణ ఉద్యమ ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నుంచి ఉద్యమకారుల బస్సు యాత్రను జెండా ఊపి తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్ గౌడ్ ప్రారంభించారు. ఉప్పల్ రింగ్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమలేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నేటి వరకు నెరవేరకపోవడంపై నిరసన తెలిపారు. ఉద్యమకారునికి, అమరులైన కుటుంబాలకు, ఉద్యమకారులకు 250 గజాలు ఇళ్ల స్థలాలు, తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు,పింఛన్, ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేయండి

- రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే
- అధికారులకు బండారి ఆదేశం



కాప్రా ఈద్గా మైదానంలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులను పరిశీలిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బద్రుద్దీన్ తదితరులు



మేడ్చల్‌లో నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ మణికంఠాగౌడ్, ముస్లిం మత పెద్దలు

**కాప్రా,మార్చి 29:** రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేసే కాప్రా ఈద్గా మైదానం వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కాప్రా ప్రాంత ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రార్థనలు జరుపుకునే చారిత్రక కాప్రా ఈద్గా మైదానాన్ని, అక్కడ జరుగుతున్న ఫ్లోరింగ్ పనులను ఈద్గా కమిటీ చైర్మన్ ఎంకే. బద్రుద్దీన్, ముస్లిం మత పెద్దలతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే వెంటనే జీహెచ్ఎంసీ శానిటేషన్, జలమండలి, ఎలక్ట్రిసిటీ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమం లో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ఉప్పల్ మైనార్టీ ఇన్‌చారిజ ఎం కె. బద్రుద్దీన్, ముస్లిం మత పెద్దలు,బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, నవీన్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రంజాను ప్రశాంతంగా జరుపుకోవాలి

రంజాన్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఏఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల ఇమాం, మోజాంలకు రంజాన్‌ను పురస్కరించుకుని సొంత నిధులతో నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### వంజరి సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

వంజారి సంఘం అభివృద్ధికి సహాయ,సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శని వారం ఏఎస్‌రావునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను సంఘం ప్రతినిధులు కలిసి పలు సమస్యలు ప్రస్తావించారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, వెంకటేశ్, అమరేందర్, ముత్తయ్య ,సురేందర్, ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి ప్రవీణ్ కరిపే, జైనవీన్ పాల్గొన్నారు

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్పొరేటర్

**మల్లాపూర్:** రంజాన్‌ను పురస్కరించుకుని డివిజన్ పరిధి, ఓల్డ్ మల్లాపూర్‌లోని జమా మసీద్‌లో, అశోక్ నగర్‌కాలనీలోని ఉస్మాన్ ఏ ఘని మస్జీద్ ఆధ్వర్యం లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో జరిగిన ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.కార్యక్రమంలో మసీద్‌కమిటీ సభ్యులు రెహ్మాన్ అలీ,ఇర్ఫాన్ ఖాన్, జహంగీర్,ఎండీజాకీర్‌అలీ, చాంద్ బాషా, బాసిత్ఖాన్, సయ్యద్ ఉమర్, నాయకులు వాసుగౌడ్,ప్రవీణ్,ఉస్మాన్,శ్రీనివాస్,రఘు ఉన్నారు.

### కాల భైరవ ఆలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

**ఉప్పల్:** ఉప్పల్ భగాయత్‌లో అమావాస్య సందర్భంగా కాలభైరవ ఆలయంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాశ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి పార్టీ నాయకులు ప్రవీణ్‌ముదిరాజ్, మహేందర్, నాగేశ్వరరావు, నాగరాజు, కిశోర్, నిరంజన్ , కిరణ్, ఫణిందర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పేద ముస్లింలకు మాజీ కౌన్సిలర్ చేయూత

**మేడ్చల్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ మున్సిపల్ 6వ వార్డు మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ నిత్యావసర వస్తువుల తో కూడిన కిట్లు 1000 తయారు చేయించారు. ఈ కిట్లను పండుగకు ముందే శుక్ర, శనివారాల్లో గిర్మాపూర్, రాయిలాపూర్, అత్వెల్లి, కిష్టాపూర్ , పూడూర్, మేడ్చల్‌కు చెందిన ముస్లింలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, నాయకులు పాషా, రఫిక్, ఇనాయిన్, అంజత్, ఆరీఫ్, ఖాన్, అష్రాఫ్, అజ్మత్, రఫిక్, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.



కీసరలోని వీఆర్ సెరినిటీ పాఠశాల ఆవరణలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటుతున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ, మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేశ్

## సంజీవ హనుమాన్ ఆలయానికి విరాళం

**రామంతాపూర్,మార్చి 29 :** రామంతాపూర్ డివిజన్‌లోని కామాక్షిపురం శ్రీ సంజీ వ హనుమాన్ ఆలయం స్లాబ్ కోసం శనివారం సుప్రయూత్ వింగ్ అసియేషన్ అధ్యక్షులు గడ్డం సాయికిరణ్ రూ.25 వేల చెక్కును ఆలయ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నాగరాజు, ఎస్.కృష్ణారావు,తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని తొలగించడం హేయమైన చర్య



మల్కాజిగిరి చౌరస్తాలో తొలగించిన చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, మార్చి 29:** ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తొలగించడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మల్కాజిగిరి చౌరస్తాలో తొలగిచిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల కోసం చలివేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ స్వచ్ఛదంగా మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కక్షకట్టి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజల కోసం నియోజకవర్గంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సర్కిల్ జేఏసీ అధ్యక్షుడు వెంకన్న, పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు



ముగింపు కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న విద్యార్థులు

**శామీర్ పేట్, మార్చి 29:** ప్రగతి మహావిద్యాలయ డిగ్రీ కాలేజ్, కోఠి ఆధ్వర్యంలో లాల్గడి మలక్‌పేట్ గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక ఏడు రోజుల గ్రామ శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎస్. ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాశోభారాణి, ప్రశాంత్ రెడ్డి, సీనియర్ కార్యకర్తలు పాడు, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కండి

**ఉప్పల్,మార్చి29:**హరిహర క్షేత్రం చిలుకేశ్వర ఆంజనేయ స్వామి ఆలయం, గాయత్రి మాత,ఉప ఆలయాల పునర్నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ పనులను శనివారం ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్లాబ్‌కు అవసరమైన కాంక్రీట్ అందించారని, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ స్లాబ్‌కు అవసరమైన స్టీల్ ఇచ్చారని, ఆలయ నిర్మాణం కోసం ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారని తెలిపారు. వారి అందరికీ ఆలయకమిటీ,చిల్కానగర్ గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా కరీంగూడ పాఠశాల గోల్డన్‌జూబ్లీ ఉత్సవాలు



గోల్డన్‌జూబ్లీ వేడుకల్లో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

**కీసర,మార్చి29:**నాగారం మున్సిపాల్టీ పరిధిలోని కరీంగూడ వార్డు కార్యాలయంలోని ప్రభుత్వ పాఠశాల 75వ గోల్డన్‌జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శశిధర్, జిల్లా విద్యాశాఖ ఏఎంవో రవీందర్‌రాజు, ఎంఈఓలు మురళీకృష్ణ, సురేశ్, రంగాచారి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, జమదగ్ని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శ్రీధర్, పూర్వ ఉపాధ్యాయులు రాంప్రసాద్, వెంకటేశం, విలియమ్స్, రేడ్యానాయక్, గురురావు, రవీందర్ రెడ్డి, ఏపీసీ చైర్మన్ మంజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## టీ హబ్ లో మిస్.. మిసెస్‌ల... ఫ్యాషన్ షో

కొండాపూర్, మార్చి 29: మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ – బ్యూటిఫుల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ ఫినాలే ఆద్యంతం ఆకట్టుకుంది. నాలెడ్జ్ సిటీలోని టి హబ్ లో శనివారం నిర్వహించిన ఫినాలే ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ప్రధాన కార్యదర్శి జై రంజాన్, టాలీవుడ్ నటులు వితికా షెరు, నిర్వాహకులు కిరణ్మయి అలివేలు తో కలిసి ప్రారంభించారు. యువతులతో పాటు వివాహిత మహిళలు వయ్యారాల నడకలతో ర్యాంప్ పై హొయలొలికిస్తూ కనువిందు చేశారు. వారి నడక, నడత, ఆధారంగా విజేతలను ప్రకటించారు.

# దోమలు బాబోయ్...దోమలు!

- మేడ్చల్‌పై దోమల పంజా
- కంటిమీద కునుకు కరువు
- కరెంట్ పోతే జాగరణే
- కానరాని ఫాగింగ్





మేడ్చల్ పట్టణంలోని పలు వార్డుల్లోని ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం

**మేడ్చల్, మార్చి 29:** మేడ్చల్ మున్సిపాలిటీ దోమల మయంగామారింది. మున్సిపాలిటీలో ఏ అవార్డుకెళ్లినా దోమల రాజ్యమేలుతున్నాయి. దాదాపు నెల రోజుల నుంచి దోమలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా అవుతుంది. సాయంత్రం 6 గంటల దాటిదంటే ఆరుబయటకు వెళ్లలేని పరిస్థితి.ఎవరిని కదిపినా అమ్మో దోమలు అంటున్నారు.

### అధ్వాన్నంగా పారిశుధ్యం

మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్, కేఎల్ఎల్ వెంచర్, కిందిబస్తీ, రాయిలాపూర్, గిర్మాపూర్, రైల్వేస్టేషన్,ఎన్‌జీవోస్ కాలనీ, ఆర్టీసీ కాలనీతో పాటు ప్రతి చోటా విపరీతంగా పెరిగిపోయిన దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు ప్రజలు ఇబ్బంది పడుతున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో ఎక్కడా కూడా దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. తూతూ మంత్రంగా జరుగుతున్న ఫాగింగ్‌తో దోమలు నియంత్రణలోకి రావడం లేదు.ఇదిలా ఉంటే ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్త కారణంగా కూడా దోమలు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నాయి. పట్టణంలోని ఖాళీ ప్లాట్ల చెత్తను తొలగించడంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు చోట్ల ఖాళీ ప్రదేశాలతో పేరుకుపోయిన చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది తొలగించకపోవడంతో ప్రజలు కాల్చివేస్తున్నారు. దీంతో కాలుష్యం పెరుగుతున్నది.

### ఫాగింగ్ జరగడం లేదు



మేడ్చల్ పట్టణంలో ఎక్కడా కూడా ఫాగింగ్ జరగడం లేదు. దీంతో విపరీతంగా దోమలు పెరిగిపోతున్నాయి.సాయంత్రం6 అయిందంటే చాలు ఇంట్లో తలుపులు పెట్టుకొని కూర్చోవాల్సి వస్తుంది. దోమల నియంత్రణకు మిషన్‌లు, దోమల బ్యాట్‌లను వాడాల్సి పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

**-సాయిబాబా, రాఘవేంద్రకాలనీ, మేడ్చల్**

### నెలకు రెండు సార్లు ఫాగింగ్



ఫాగింగ్ మిషన్లు మూడు ఉంటే రెండు పని చేస్తున్నాయి. ప్రతి రోజూ రెండు వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నాం. ఇలా చేస్తూ పోతుంటే ఒక్కో వార్డులో నెలకు రెండుసార్లు జరుగుతుంది. ఖాళీ ప్లాట్లలో చెత్తను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఎల్ఆర్ఎస్, పన్నుల వసూళ్లు ముగియగానే ప్రత్యేక డ్రైవ్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

**– నాగిరెడ్డి, కమిషనర్, మేడ్చల్ మున్సిపాలిటీ**

## మౌలిక వసతుల కల్పనకు కృషి

**బోడుప్పల్, మార్చి 29:** మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు మాజీ కార్పొరేటర్ బిగి జంగయ్య యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని క్రాంతి కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను వర్క్ఇన్‌స్పెక్టర్ సతీశ్‌తో కలిసి ఆయన శనివారం పరిశీలించారు.

## మినీ శిల్పారామంలో ఉగాది వసంతోత్సవాలు ప్రారంభం

**రామంతపూర్, మార్చి 29:** ఉప్పల్ మినీ శిల్పారామంలో నాలుగు రోజుల ఉగాది వసంతోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కూచిపూడి , భరత నాట్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. నాట్య గురువులు శివగంగ, కుమారి గోపిక, కుమారి మనీష, కుమారి మేఘ, కుమారి శ్రీలక్ష్మి శిష్య బృందం కూచిపూడి , భరతనాట్య ప్రదర్శనలో శ్లోకామాల, శ్రీ విఘ్న రాజాం భజే, పుష్పాంజలి, శ్లోకాంజలి, స్వాగతం కృష్ణ, అలరిపు, జతిస్వరం, జగన్మోహన్నే, కలియుగవారాంతం, కథనకుతూహలం తిల్లాన,మంగళం అంశాలు ఆహుతులను అలరించాయి. ఉగాది పండుగ పురస్కరించుకొని ఉప్పల్ మినీ శిల్పారామం లో జ్యోతిష్యులు శ్రీ జల సోమనాథ శాస్త్రిచే పంచాంగ పఠనం సాయంత్రం నిర్వహించారు. రమాదేవి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన అందరిని అలరించాయి.



మినీ శిల్పారామంలో చిన్నారుల భరత నాట్య ప్రదర్శన భంగిమ

## మాజీ ప్రేమికుడిపై కేసు నమోదు

**పీర్జాదిగూడ మార్చి 29:** మాజీ ప్రేమికుడిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువతి బోడుప్పల్ మారుతీనగర్‌లో ఉంటుంది. 2019లో యువతికి కొల్ల చంద్రప్రకాశ్‌తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఈ క్రమంలో సదరు యువతికి చంద్రప్రకాశ్ ప్రవర్తన నచ్చక కొంతకాలం నుంచి దూరంగా ఉంది. కొద్ది రోజుల క్రితం తనకు వేరే అబ్బాయితో పెళ్లి నిశ్చయమైంది.ఈ విషయం తెలుసుకున్న సదరు ప్రేమికుడు పెళ్లికొడుకుకు ఇద్దరు చనువుగా ఉన్నప్పుడు దిగిన ఫొటోలను పంపించి అసభ్యంగా మాట్లాడడంతో పెళ్లి ఆగిపోయింది. తెలిసిన వారితో కొంత కాలం నుంచి తనపై అసభ్యంగా మాట్లాడుతూ పెళ్లి అడ్డుకోవడమే కాకుండా వేధిస్తున్నాడని, చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మేడిపల్లి పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికులకు పని గంటలు తగ్గించాలి

దుండిగల్,మార్చి29: పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కార్మికులకు పని గంటలు తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట వార్డ్ కార్యాలయంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులతో సమావేశమయ్యారు. మున్సిపల్ కార్మికులకు తరుచుగా ఉచిత వైద్య శిబిరాలు పెట్టి వైద్యం చేయాలని వారు కోరారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఘట్ కేసర్, మార్చి 29:** ఎల్ఆర్ఎస్‌లో లోపాలు సరిచేయకపోవడంతో పాటు అప్రూవల్ లేకుండానే డబ్బులు వసూలు చేయొద్దని ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన కందకట్ల నారాయణరెడ్డి జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. ఘట్ కేసర్ పట్టణంలోని చాలా ప్లాట్లు ఎల్-1 వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అయినా డిమాండ్ నోటీసు పంపి డబ్బులు కట్టించుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన కందకట్ల నారాయణ రెడ్డి గతంలో అప్లికేషన్ నెం. ఎం/జీహెచ్ఎంసీ/01 8263/2020 ద్వారా ఎల్ఆర్ఎస్ స్కీం కింద దరఖాస్తు చేసుకున్నారు. కాగా డబ్బులు చెల్లించాలని అధికారుల నుంచి ఫోన్లు వచ్చాయి. ఎల్ఆర్ఎస్ ప్రస్తుత అప్లికేషన్ స్టేటస్ చూడగా ఎల్-1 వద్ద పెండింగ్ ఉన్నట్లు చూపిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్ అప్లికేషన్ ఎల్-1 వద్ద పెండింగ్‌లో ఉండగా డబ్బులు కట్టించుకోవడం సరికాదని ఆరోపించారు.ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాతనే అప్రూవల్ ఇచ్చి డబ్బులు కట్టించాలని కోరారు. తప్పుడు సమాచారంతో పేదలు అప్పులు చేసి డబ్బులు చెల్లించిన తర్వాత దరఖాస్తుల పెండింగ్ పేరుతో ఇబ్బందులకు గురవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీకాంత్ యాదవ్



బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్‌గా సభ్యుడిగా ఎన్నికైన శ్రీకాంత్ యాదవ్

**మేడ్చల్, మార్చి 29:** మేడ్చల్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మేడ్చల్ పట్టణానికి చెందిన జూనియర్ అడ్వకేట్ శ్రీకాంత్ యాదవ్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పలువురు పోటీ చేయగా శ్రీకాంత్ యాదవ్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సేవలందిస్తూ మేడ్చల్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన గెలుపునకు సహకరించిన మద్ధతుదారులు, నాయకులకుకృతజ్ఞతలు తెలిపారు.

## రూ.5,60786 చికెన్ వేస్టేజ్ వేలం

**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 29 :** దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 2025-2026 సంవత్సరానికి చికెన్ వేస్టేజ్ వేలం రూ. 560786కు ఆయేషా ట్రేడర్స్ దక్కించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో ముగ్గురు అభ్యర్థులు పాల్గొనగా, ప్రభుత్వం వారి పాట రూ. 450000 ఉండగా ఆయేషా ట్రేడర్స్ రూ. 560786లకు చికెన్ వేస్టేజ్ వేలం పాట దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎ.వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది, రంజాన్‌లకు ప్రత్యేక కౌంటర్లు

**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 29:** ఆస్తిపన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల చెల్లింపులు, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఉగాది, రంజాన్ పండుగ సెలవు దినాల్లో నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్లు భాస్కర్ రెడ్డి, నాగమణిలు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీల ప్రజలు సెలవు దినాల్లో ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఎల్ఆర్ఎస్ చెల్లించి మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని వారు కోరారు.

## కొనసాగుతున్న ఉత్తరాల ఉద్యమం

**ఘట్ కేసర్, మార్చి 29:** శిథిలావస్థకు చేరుకున్న గురుకుల్ విద్యాలయాన్ని పరిరక్షించాలనే డిమాండ్‌తో మాజీ సర్పంచ్, గురుకుల్ పూర్వ విద్యార్థి అబ్బసాని యాదగిరి యాదవ్ చేపట్టిన సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమంలో భాగంగా పూర్వ విద్యార్థి కంది ప్రేమ్ కుమార్ ఉత్తరాలను స్పీడ్ పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు పంపించారు. గురుకుల్ విద్యాలయానికి పూర్వ వైభవం కల్పించేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్త కొండ వెంకటేశ్, గడ్డం వెంకటేశ్ యాదవ్, ఇమ్ము, మానుక కుమార్, చిత్తరంజన్, తిమోతి పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ పోస్టాఫీసు నుంచి ఉత్తరాలను పోస్టు చేస్తున్న పూర్వ విద్యార్థులు